డ్యాన్సర్‌కు కృత్రిమ కాలు

- భగవాన్ మహవీర్ సేవా సంస్థ సహకారం
- పునర్జన్మ లభించిందన్న నాగమణి



కృత్రిమ కాలుతో నాగమణి

జవహర్‌నగర్: వైజాగ్‌కు చెందిన నాగమణికి చిన్నతనం నుంచి కాలు చిన్నదిగా ఉంది. ఆమెకు వివాహం జరిగి ఇద్దరు పిల్లలు పుట్టాక భర్త మరణించాడు. కుటుంబ పోషణ నిమిత్తం ఆమె ఈవెంట్లలో డ్యాన్సర్‌గా పనిచేస్తూ వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ విషయాన్ని రాష్ట్ర వికలాంగుల హక్కుల సాధన సమితి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు మెరుగు శివకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకురాగా కింగ్ కోఠిలోని భగవాన్ మహవీర్ సేవా సంస్థ సహకారంతో నాగమణికి కృత్రిమ కాలు అమర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు కృత్రిమ కాలు అమర్చడంతో పునర్జన్మ వచ్చిందని, తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి, భగవాన్ మహవీర్ సేవా సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డ్యాన్సర్‌గా మరింత రాణిస్తానన్నారు. రాష్ట్ర వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్‌కుమార్, నాగరాజు, మహవీర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్: రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. మంగళవారం కొంపల్లిలోని లేబర్ అడ్డా వద్ద రోజువారీ కూలీలకు ట్రాఫిక్ నిబంధలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పక్కన నడిచే సమయంలో ఫుట్‌పాత్‌లను ఉపయోగించుకోవాలని, అవి లేని ప్రాంతాల్లో రోడ్డు దాటే సమయంలో చేతులతో సిగ్నల్ ఇస్తూ దాటాలన్నారు.

నల్లా సంపుల తనిఖీ



చింతల్: నల్లాలకు మోటార్లు బిగించి నీటిని తోడితే కఠిన చర్యలు తప్పవని జలమండలి డీజీఎం రాజేష్ హెచ్చరించారు. మంగళవారం సుచిత్ర జలమండలి సెక్షన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్ 2, సాయిబాబానగర్ కాలనీల్లో మేనేజర్ శివప్రసాద్, సిబ్బందితో కలిసి పలు ఇళ్లల్లో నీటి సంపుల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి పైపులైన్లకు మోటార్లు అమరిస్తే మిగతా ఇళ్ల వాసులకు లో ప్రెషర్ తలెత్తుతుందన్నారు. అక్రమ మార్గంలో నీటిని తోడితే కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



కొంపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఏఈ శ్రీనివాస్

కుత్బుల్లాపూర్: విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కొంపల్లి ఏఈ శ్రీనివాస్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ 2వ వార్డులో , 5వ వార్డులోని సాయిబాబా నగర్, పోచమ్మ గడ్డలో నెలకొన్న లో ఓల్టేజీ సమస్యలపై మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏఈని కలిసి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన మంగళవారంలో ఓల్టేజీ సమస్య నెలకొన్న ఆయా ప్రాంతాల్లో 5 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్, అంజి ముదిరాజ్, రాజశేఖర్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రాకపోకలు.. ఇక బిందాస్





హమ్మయ్య.. ఇక కష్టాలు తీరినట్లే.. 2020 సంవత్సరంలో ప్రారంభమైన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనే.. నయం అన్నట్లు ఆగుతూ సాగుతూ 2025లో తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం పనుల్లో స్పీడ్ పెరిగింది. దాదాపు 90శాతం పనులు పూర్తయ్యాయి. దీంతో పలు గ్రామాలు, కాలనీల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనుల కారణంగా ఈ మార్గాన్ని మూసేయంతో వివిధ గ్రామాలు, కాలనీల ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. మేడ్చల్ పట్టణంలో రైల్వే స్టేషన్ అవతలి వైపు ఉన్న గిర్మాపూర్, రాయిలాపూర్, బండమాదారం, శ్రీరంగవరం గ్రామాలతో పాటు సీసీఐ, సరస్వతి కాలనీ, మెట్రో ల్యాండ్, రైల్వే ల్యాండ్, రైల్వే కాలనీ తదితర ప్రాంతాలకు మేడ్చల్ నుంచి వెళ్లాలంటే అవస్థలు పడేవారు. గత నెలలో రామలింగేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్ని పార్టీల నాయకులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురావడంతో ఒకవైపు పనులు పూర్తయ్యాయి. అటువైపు నుంచి రాకపోకలు కొనసాగుతుండగా త్వరలోనే పనులు పూర్తి చేయించి రాకపోకలకు అవకాశం కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు. – మేడ్చల్

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



నీలాగోపాల్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

నిజాంపేట్: 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ రాఘవేంద్రరావు, శ్రీనివాస్ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం మాజీ మేయర్ నీలాగోపాల్‌రెడ్డిని కలిశారు. 20వ తేదీన శ్రీనివాస అభయాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించే శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వ్యాపారులు

మేడ్చల్: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్డు తవ్వి పూర్తి చేయక పోవడంతో ప్రజలతో పాటు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారని హౌసింగ్ బోర్డు వ్యాపారులు అన్నారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ హౌసింగ్ బోర్డు రోడ్డులోని వ్యాపారులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీ పనులు పూర్తిచేసి రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో వ్యాపారానికి ఆటంకం ఏర్పడుతోందని, ఫుడ్ వ్యాపారాలు దుమ్ము కారణంతో పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయించాలని కోరారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నారాయణ

మేడ్చల్‌రూరల్: 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పెద్ద ఎత్తున బీఆర్‌టీయూ నాయకులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మన్ నారాయణ కోరారు. మేడ్చల్ పట్టణంలోని బీఆర్‌టీయూ కార్యాలయంలో మంగళవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని, మే డే రోజున బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో కంపెనీల వద్ద జెండా ఆవిష్కరించి ఘనంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, బీఆర్‌టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్, నాయకులు రాజ్‌కుమార్, నర్సింహచారి, సంతోష్ కుమార్, ప్రభాకర్, యాదగిరి, గోపాల్, వెంకట్రావు, సుదర్శన్, శేఖర్, సురేష్, శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ నాయకులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనమైన పూడూర్ గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టాలని, మే నెలలో నిర్వహించే జాతరకు ఏర్పాట్లు పూర్తిచేయాలని గ్రామ నాయకులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని పలు సమస్యలు విన్నవించి వాటిని పరిష్కరించాలని కోరారు. పలు కాలనీల్లో సీసీ రోడ్లు వేయాలని, మే నెలలో పెద్ద ఎత్తున నిర్వహించే పోచమ్మ–మైసమ్మ, దుర్గమ్మ జాతర సందర్భంగా ఆలయాల వద్ద వసతులు కల్పించాలని వివరించారు. వినతిపత్రం స్వీకరించిన ఆయన వారితో కలిసి గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్లు వేస్తామని, జాతరకు అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పోచయ్య, వెంకటేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, దప్పు క్రిష్ణ, జనార్దన్‌రెడ్డి, బక్క శేఖర్, కృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉన్నత విద్య

కామన్ ఎంట్రన్స్ టెస్ట్ బ్రౌచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విద్యలో అడుగుపెట్టేందుకు(టీజీ ఈఏపీసీఈటీ) కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం మల్లారెడ్డి యూనివర్సిటీ మాక్‌టెస్ట్‌తో పాటు స్కాలర్‌షిప్‌లను ప్రకటించింది. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మల్లారెడ్డి విద్యా సంస్థల చైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డిలు యూనివర్సిటీ డీన్, విద్యార్థులతో కలిసి కామన్ టెస్ట్ బ్రౌచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వీసీ మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసుకుని ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులు మల్లారెడ్డి యూనివర్సిటీ వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలన్న సంకల్పంతో మల్లారెడ్డి యూనివర్సిటీ మెరిట్ స్కాలర్‌షిప్‌లు ప్రకటించిందన్నారు. విశ్వవిద్యాలయం నుంచి అందిస్తున్న అన్ని కోర్సులకు మొదటి 500 మెరిట్ ఆధారిత అడ్మిషన్లకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. ఈ నెల 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని, 20న ఆన్‌లైన్ విధానంలో మాక్‌టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో రూ.7.5 కోట్ల స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న వజ్రేశ్‌యాదవ్, మహేశ్‌గౌడ్, పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో కాంగ్రెస్ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్యతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజుముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు యాదవ్, మాజీ సర్పంచులు వెంకటేశ్‌ముదిరాజ్, యాదగిరియాదవ్, నాయకులు జనార్దన్‌రెడ్డి, మల్లేశ్, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దేవేందర్‌ముదిరాజ్, చిత్తారియాదవ్, సుధాకర్, ఫరూక్, రాజారత్నం, ఖయూమ్, నర్సింగ్‌రావు, అష్రాఫ్ అలీ, మాధవరెడ్డి, రాజు పాల్గొన్నారు.



ఆర్‌జీకే కాలనీలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్‌లో వజ్రేష్‌యాదవ్ తదితరులు

అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలో..

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైబాపూ, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ హాజరై పాదయాత్రలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య విలువలు దేశంలో ఉన్నాయని, భిన్నమతాలకు నిలయంగా రాజ్యాంగం అవతరించిందన్నారు. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు ముప్ప రామారావు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేతనాగరాజు, నేతలు కృష్ణయాదవ్, విజయ్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, జంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ తీరుపై.. కస్సుబుస్సు

ఘట్‌కేసర్ పట్టణంలోకి రాని డిస్ట్రిక్ట్ బస్సులు

- రైల్వే వంతెన పనుల సాకుతో బంద్
- ప్రత్యమ్నాయ మార్గం ఉన్నా నిర్లక్ష్యం
- బైపాస్ వరకు వెళ్లాలంటే తప్పని తిప్పలు
- ఇప్పటికే అధికారులకు వినతి పత్రాలు
- అయినా స్పందించని ఆర్టీసీ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డు మీదుగా వెళ్తున్న జిల్లా బస్సులు

ఘట్‌కేసర్: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపం కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నియోజకవర్గంలో ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట్‌లో ఆర్టీసీ బస్సు ప్రయాణ ప్రాంగణాలు ఉన్నాయి. మేడ్చల్ మీదుగా ఆదిలాబాద్, నిజామాబాద్ వైపు, ఘట్‌కేసర్ మీదుగా వరంగల్, భూపాలపల్లి –హైదరాబాద్ జాతీయ రహదారి, శామీర్‌పేట్ మీదుగా రాజీవ్ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఆయా రహదారిపై వెళ్లే ప్రయాణికులకు మాత్రం జిల్లా(డిస్ట్రిక్ట్) బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంగణంలోకి బస్సులు నడిపించేందుకు అవకాశం ఉన్నా అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం..

ఘట్‌కేసర్‌లో రెండేళ్లుగా రైల్వే వంతెన పనులు కొనసాగుతున్నాయి. పనులు ఆలస్యం కాకూడదని జిల్లా బస్సుల రాకపోకలు నిలిపివేశారు. గతంలో పట్టణం నుంచి వరంగల్, యాదగిరి గుట్ట, మోత్కూరు, ఆలేరు, జనగాం వైపు వెళ్లే బస్సులు నడిపించేవారు. పనులు కొనసాగుతున్నా బస్సులు లోపలికి వచ్చి అంబేడ్కర్ చౌరస్తా, ఎదులాబాద్ రోడ్డు నుంచి అండర్ పాస్ రోడ్డు మీదుగా జాతీయ రహదారిపైకి వెళ్లేందుకు అవకాశం ఉంది. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో బస్సులు పట్టణంలోకి రావడం లేదు. ఇప్పటికే పలుమార్లు నాయకులు ఆర్టీసీ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందన కరువైంది. దీంతో వివిధ జిల్లాలకు వెళ్లాల్సిన వారు బైపాస్ రోడ్డు వరకు వెళ్లాల్సి వస్తోంది. ఆటోల్లో అక్కడి వరకు ప్రయాణించాల్సి వస్తోంది. వారిపై అదనపు భారంతో పాటు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నిసార్లు ఆటోలు దొరక్కపోవడంతో చాలా సమయం వేచిచూడాల్సి వస్తోంది. కొంతమంది ప్రయాణికులు బైపాస్ రోడ్డు వరకు నడిచి వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా బస్సులు నడిపించాలి



పట్టణంలోకి జిల్లా బస్సులు రాకపోవడంతో ప్రయాణికులపై అదనపు భారం పడుతోంది. బస్సు ప్రయాణ ప్రాంగణం నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా తిరిగి జాతీయ రహదారిపైకి వెళ్లేందుకు అవకాశం ఉంది. అయినా అధికారులు స్పందించడం లేదు. జిల్లా బస్సులు యథావిధిగా నడిపించాలి.

– మేడబోయిన సంజీవముదిరాజ్, స్థానికుడు

ప్రయాణికులకు ఇబ్బందులు



జిల్లా బస్సులు పట్టణంలోకి రాకపోకవడంతో బైపాస్ రోడ్డు వరకు తప్పనిసరి వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికులపై అదనపు భారం పడుతోంది. జిల్లా బస్సులు పట్టణంలోకి నడిపించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– పొట్లచెరువు శరత్‌గౌడ్, స్థానికుడు

ఇనుప రాడ్‌తో దాడి చేసిన నిందితుల రిమాండ్



ఘట్‌కేసర్: పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిని ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ కూలర్ కంపెనీలో పని చేసే రియాజుద్దీన్‌తో ముగ్గురు స్నేహితులు మహమ్మద్ తాబరేజ్, ఇక్లాక్, ప్రకాశ్‌రామ్ మధ్య నెల రోజుల క్రితం గొడవ జరిగింది. పాత కక్షలతో ముగ్గురు కలిసి ఆదివారం రాత్రి రియాజుద్దీన్‌పై ఇనుప రాడ్‌తో దాడి చేశారు. గాయాలైన అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

కార్యాలయం ప్రారంభం

జగద్గిరిగుట్ట: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ సంఘం కార్యాలయాన్ని జాతీయ మైనార్టీ అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ జాంగిర్ హుస్సేన్ మంగళవారం ప్రారంభించారు. అదే విధంగా నూతనంగా ఎన్నికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ సుభాష్ చంద్రబోస్ నగర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులను సన్మానించారు. కాలనీ సొసైటీ అధ్యక్షుడిగా శివ నారాయణ, ఉపాధ్యక్షుడిగా బాపూజీ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య గౌడ్, రాష్ట్రీయ దళిత సేన జాతీయ ప్రధాన కార్యదర్శి వై. బాలరాజు, ఉపాధ్యక్షులు ఎం.జనార్దన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్

జీడిమెట్ల: జీడిమెట్ల పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం రాత్రి చింతల్ అంబేడ్కర్‌నగర్, అపురూప కాలనీలో పర్యటించారు. కాలనీల్లో సీసీ కెమెరాల పనితీరు తెలుసుకున్నారు. అనంతరం జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు, పోలీసులకు మధ్య స్నేహపూరిత వాతావరణం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాయుడు రమణ, తిప్పారెడ్డి, గణేషన్, కాలనీల ప్రజలు పాల్గొన్నారు

స్లాట్ రిజిస్ట్రేషన్ విధానం రద్దు చేయాలి



ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

ఘట్‌కేసర్: ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్లాట్ రిజిస్ట్రేషన్ విధానం సరైంది కాదని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఘట్‌కేసర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. దస్తావేజుల తయారీ నిలిపివేసి సబ్‌రిజిస్ట్రార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్లాట్ బుకింగ్‌తో వేలాది మంది డాక్యుమెంట్ రైటర్లు జీవనోపాధి కోల్పోతారని అన్నారు. నూతన స్లాట్ విధానం రద్దు చేసి పాత విధానం అమలు చేయాలని, పాత విధానంతో వేలాది మంది స్వయం ఉపాధి పొందుతున్నామని తెలిపారు. స్పందించకపోతే తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నరేశ్ గౌడ్, రాజేశ్‌యాదవ్, శ్రీకాంత్‌గౌడ్, సుధాకర్, లక్ష్మణ్‌చారి, కృష్ణకుమార్, మహేశ్, అనిల్, ఆర్.నరేశ్, యూనిస్, సునీల్, మహేశ్, శివరెడ్డి, శ్రవణ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవేంకట మరకత చంద్రమౌళీశ్వర

హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు



ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధి శిల్పానగర్‌లోని శ్రీవేంకట మరకత చంద్రమౌళీశ్వర హనుమాన్ దేవాలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సెలర్లు సబితఆంజనేయులుగౌడ్, కౌకుట్ల అనంతరెడ్డి, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ ధర్నా



దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ అన్నారు. కార్మికుల జీతాలను చెల్లించాలని కోరుతూ దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్మికులకు జీతాలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణ, రాములమ్మ, సీఐటీయూ మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.